


# వరుడి కోసం వేట

వేంకటరమణయ్య కాలేజీలో ప్రధానాంధ్రోపన్యాసకుడు. భార్య చనిపోయేటప్పటికి వారిద్దరికీ ఏవిచారమూ లేదుగాని ఒక్క కూతురు వివాహసమస్య మాత్రం కొంతగా బాధించింది. వేంకటరమణయ్య ఈ విషయమై తీవ్రంగా ఆలోచించగా ఒక ఉపాయం తట్టింది.

ఆనాడు కాలేజీలో ఇంటరు తరగతిలో సోమయాజులనే అబ్బాయిని గుర్తించాడు. అతడు ఆనాటివరకూ చాలా బీదవాడు. ఊళ్లో నలుగురు పెద్దమనుషులూ ఇచ్చిన స్కాలర్ షిప్‌లతో, [illegible] ఎందరో ఇచ్చిన బాధగా భగవంతుడా అనుకుంటూనే సంపాదిస్తున్న డబ్బుతో. వారాలు చేసుకుని చదువుకుంటున్నాడు. స్కూలు ఫైనల్‌లో రెండేళ్లు తప్పడం వేయడంవల్ల అతని వయస్సు ముదిరిపోయిందనే చెప్పాలి

సోమయాజులుతో ఆనాడు వేంకటరమణయ్య జరిపిన సంభాషణవల్ల ఆయనకు స్పష్టమయినది ఏమంటే సోమయాజులు వినయం అధికంగా చూపే మితభాషి అని. ఇందువల్ల ఆయన రాబట్టదల్చుకున్నది ఏమంటే సోమయాజుల మీద తాను వేసిన ఎత్తు పారిందని. 'నువ్వు వెంటనే వెళ్లి ఎవరెవరిళ్ళలో వారాలు చేసుకుంటున్నావో వాళ్లందరికీ స్వస్తి చెప్పెయ్యి. తరవాత నీ పెట్టె బేడా అన్నీ మాయింట్లో సర్దేసుకో. మాయింట్లో నే వుండి చదువుకుందువుగాని' అని ఆయన సోమయాజులుతో చెప్పాడు.

తరువాత ఒకనాడు సోమయాజులు మేనమామకి ఆయన ఉత్తరం రాశాడు- మీరు సోమయాజులు జీవితంలో అతని పూచీ పట్టించుకో వలసిన అవసరం లేదు- అలా అని. దానికి యజ్ఞనారాయణ 'ఒక బీదకుఱ్ఱవాడికి ఆశ్రయం ఇచ్చిన మీరు వందనీయులు; మీరు ఈ పని చేసినందుకు పరమసంతోషం—' అలా అని రాశాడు జవాబు.

తరవాత ఒకనాటి ప్రశాంత సూర్యోదయ సమయాన వేంకటరమణయ్య చేసిన ఈ చదరంగపు ఎత్తుకు అర్థం లోకులకి సుస్పష్టంగా తెలిసిపోయింది. సోమయాజులు వెలనాటి [illegible] వాడని తెలిసిన కొందరు అతన్ని [illegible] అసహ్యించుకోవడం మొదలు పెట్టారు. సరే, అసలు సంగతి ఇదీ అని తేలిన వెనక ఎవరికుటుంబం వాళ్లే బుగ్గలమీదా ముక్కులమీదా వేళ్లు పెట్టుకుని ఏవో గుసగుస లాడుకున్నారు. 'వేంకటరమణయ్య ఈ చర్యలలో ఏ వొక్కదాన్నీ గుర్తించనట్టే నిశ్చింతగా నడిచిపోతున్నాడు.

చివరికి 'నీ మేలు కోరేవాణ్ణి' అని చెప్పుకునే వాళ్ళల్లో అగ్రగణ్యుడు - 'అన్నీ తెలిసీ నువ్వే యిలా చేస్తే' అని చెప్పబోయేసరికి వేంకటరమణయ్య ఉగ్రుడై తన వాక్కుల కరించీ, లోకంలో ఉంటున్న మూఢవ్యవస్థల గురించీ పటపటా వాగేశాడు. దాంతో ఆ పెద్దమనిషి 'నువ్వు ఉపన్యాసకుడివి—' అని తప్పుకున్నాడు.

సోమయాజులు ఇంటరు ఫస్టుక్లాసులో వచ్చాడు. అక్కడినుంచీ వేంకటరమణయ్య అతనిమీద చిన్న అధికారం చూపుతూ వచ్చాడు. సోమయాజులు నేను సైన్సు చదువుకుంటాను మొర్రో, అని ఎంతో గోల పెట్టినా బలవంతాన

తెలుగు బి. ఏ. తీయించాడు. సోమయాజులు ఆ వ్యాకరణ సముద్రంలో మునిగిపోయి మరి తేలలేక అలా కొట్టుకుంటుంటే ఆయన చూసి సంతోషించాడు. పరీక్షకి వెళ్లటానికి సోమయాజులెంతో భయపడ్డాడు కాని వేంకటరమణయ్య బలవంతం చేసి పంపించాడు. 'నువ్వు నువ్వనుకునేటంత మూర్ఖుడివి కావు. అంతో యింతో రాయగలవు. అందుకనే మణి తనని తాను తెలుసుకోలేదు అన్నాడు కాళిదాసు. ధైర్యం చెయ్యి' అని చెప్పాడాయన. అందరూ ఆశ్చర్యపడేటట్టుగా సోమయాజులకి ఫస్టుక్లాసు వచ్చేసింది.

అయితే వేంకటరమణయ్య ఇక్కడినుంచీ ఒక విపుల షడ్యంత్రం పన్ని సోమయాజుల్ని అన్ని దిశలనించీ వేటాడటం మొదలుపెట్టాడు. అసలు ఈ వేట ఇంతకుముందే తన కుమార్తె మొదలుపెట్టి వుంటుందని ఆయన అనుకున్నాడు. కాని కాస్త ఆలోచించగా కూతురి జీవితంలో గాని సోమయాజుల జీవితంలోగాని ఏమీ మార్పు లేనట్టు అతనికి సులభంగానే తెలిసిపోయింది.

ఇక్కడ ఒక సూక్ష్మవిషయం చెప్పాలి. లక్ష్మి నరసమ్మను ఆమెకు పదహారవయేడు వచ్చేవరకూ వేంకటరమణయ్య చదివించాడు. సుమారు మూడు సంవత్సరాలబట్టీ అప్పటికి—వరుడికోసం ఇంచుమించు ఆ జిల్లా అంతా గాలించాడు ఆయన. దీన్నిబట్టి ఆమె ఆకారం తెలిసిపోతుంది. యౌవనంలోవుండే సహజ మాధుర్యం కూడా ఆమెలో లేదు. కంఠస్వరమే కాక ఆమె ఉపయోగించే పరిభాష కూడా కాస్త కఠోరంగా వుంటుంది.

అయితే ఇంత అభాగ్యురాలికి సోమయాజులు అనువైనాడు. తనయింట భోజనం చేసి చదువుకొంటున్నాడు. నిజానికి ఇది లోకువ కావలసిన పరిస్థితే. ఈ అదను తీసుకుని ఆమె సోమయాజులును ప్రతి చిన్న విషయానికీ అల్లరి చేస్తూండడం కద్దు. మాటకి ఎప్పుడన్నా లైబ్రరీకి వెళ్ళి ఏదైనా పుస్తకం చదువుకుందికి తెచ్చిపెట్టమంటుంది. సోమయాజులు అల్లాగే అని చేసి అవూసే పట్టించుకోడు. తరువాత ఆమె అడిగితే మరిచిపోయానంటాడు. నిలదీసి నీకెంత మరుపా అంటుంది.

ఇల్లాంటివే, ఏవో చీలికయ్యాలు పెట్టుకుని మాటాడితే చాలు ఈసడించే పద్ధతిలో వద్దని. చివరికి చాల్లేద్దూ, నువ్వుకూడా మాట్లాడేయ్యాలి- అనేటంతవరకూ వచ్చింది. అయితే సోమయాజులు ఈ యీసడింపులూ మాటలూ అట్టే దీనిగా పట్టించుకోలేదు. ఎందుకనంటే అతడు ఆమెను భార్యదృష్టిలో ఏనాడూ తల్చుకోలేదు. కారణం వేంకటరమణయ్యగారు నియోగి, తాను శుద్ధవైదికి. కాబట్టి తమకిద్దరికీ వివాహమని అతడు కలలోకూడా అనుకోలేదు మహా అయితే ఒకటి రెండుసార్లు అనుకొని అపవిత్రమయ్యాడేమో- ఈ రోజుల్లో ఆ మాత్రం అపవిత్రంగా కానివా డెవడుగాని!

ఇటీవల కొన్నిరోజులనుంచీ సోమయాజుల్ని లక్ష్మి నరసమ్మనూ ఇంట్లో ఒంటరిగా వదిలేసి వెంకటరమణయ్య అకారణంగా ఎటో పోతున్నాడు. పగలల్లా ఆయన ఇంట కనుపించడు, ఒక్క భోజనాల వేళప్పుడు తప్ప. దీనిభావం ఆయన తన కూతురికి చెప్పనే చెప్పాడు. అయినా ఆమె ఏమీ కలుగచేసుకోలా. ఎందుకనంటే సోమయాజులు తనంతటే ఏదో ప్రసక్తి తెచ్చుకుని తనవద్దకు వచ్చి మాటాడాలని ఆమె ఎదురు చూస్తున్నది. కాని సోమయాజులు కాలక్షేపం చెయ్యడానికి కావలసినన్ని పుస్తకాలున్నాయి. అదీగాక అతగాడు ఈ విషయమై అట్టేదూరం ఆలోచించలేదు. కనుక అతనికి తనంత తానుపోయి ఏదన్నా అదీయిదీ మాట్లాడే అవసరం కనిపించలేదు.

వేంకటరమణయ్య తన సూక్ష్మ దృష్టితో పరిశీలించాడు. సోమయాజు లేమిటి, తన కూతురేమిటి, మామూలు జీవితాలు గడిపేస్తున్నారు. ఇదేమీ బాగాలేదు ఆయనకి. తన కూతురితో చెప్పాడాయన, నువ్వు అతనితో అవసరంగా మాట్లాడాలి సుమీ అని. ఆమె ఇంతవరకూ తన ఆదేశాన్ని పాటించినట్టేమీ కనిపించలా. అందుచేత ఆరాత్రి పడుకోబోయేముందు కూతుర్ని మరోసారి హెచ్చరించాడు.

కాని ఈ కార్యక్రమం ఎల్లుండివరకూ అమలు జరగటానికి వీలులేదు. ఎందుకంటే ఇవాళ సోమయాజులు తనకి ఒక అత్యవసరపు ఖర్చుకోసం అయిదు రూపాయలూ ఆ పనికోసం ఒక

రోజూ స్వేచ్ఛ కావాలంటూ ఆయనకి దరఖాస్తు చెయ్యగా మరునాడు శెలవుగా ఇచ్చి మిగిలిన కోరికనుకూడా మంజూరు చేశాడు.

అయితే ఇక్కడే కథ అడ్డం తిరిగే సూచనలు కనుపించినై. మరునాటి సాయంకాలం సోమయాజులింటికి వచ్చాడు. రాత్రి అన్నాడు: 'మీరు చేసిన మహోపకారానికి నేను చాల కృతజ్ఞుణ్ణి. మీ ఋణం నే నీజన్మలో తీర్చుకోలేనంటే అతిశయోక్తి కాదు. ఆనాడు మీరు నాటిన లత, ఈ నాటికి పెరిగి పెద్దదై ఆశ్రయించుకోడానికొక పందిరినికూడా సంపాదించుకున్నదంటే అదంతా మీ అనుగ్రహమే. ఇవాళ నే వెళ్ళిన పని పూర్తయింది. రేపు ఒకటో తారీకునించే చార్జి తీసుకుంటాను. మీ ఆశీర్వచనంవల్ల క్రమేణా నావుద్యోగం పెద్దదయ్యే సూచనలు కూడావున్నయి. ఎప్పటికైనా ప్రతి ఉదయం మీ ఫోటోకే నేను నమస్కరిస్తాను. ప్రతి రాత్రీ నిద్ర పోయేటప్పుడు మిమ్మల్నే స్మరిస్తాను. కాని ఎప్పటికైనా మీ ఋణం పూర్తిగా తీరుతుందని నాకు నమ్మకలేదు.'

వేంకటరమణయ్య ఈ అసర్గళ కవిత్వానికి విస్తుబోయాడు-'అరె నువ్వేమిటట్లా అంటావ్? ఇంకా ఎమ్. ఏ. పరీక్షకి వెళ్ళి ఎక్కడో తెలుగు లెక్చరరుగా వెళతావనుకున్నాను. మా యింట్లో వుంటే నిన్ను కాదన్న వారెవ్వరు? చక్కగా ఆ యమ్మేకూడా ప్యాసై-ఉం!' అంటూ తడబడ సాగాడు. సోమయాజులు నమ్రతగానే 'నాకు శక్తి ఉండి అభిలాష కలిగితే అదెంతసేపు మేష్టారూ' అని ప్రసంగం ఆపాడు.

అయినా ఆయనలోని ఆశ చచ్చిపోలేదు. ఇంకా ఒకటో తారీఖు దాకా గడువుంది. అయితే లాభమేమిటి? ఆ తరవాత కూడా ఆఫీసుకి తన యింట్లోంచే వెళ్ళేటట్టు బలవంతం చేస్తే సోమయాజులు కాదనడు. పైగా నిన్నరాత్రి ఆయన తన కూతురికి కాస్త మందు వేశాడుగా, దాని ఫలితం రేపు చూడాలి!- మరునాటి తెల్లవారు జామునే లేచి, మామూలు కాఫీ వేళయినా కాకుండా, కూతురికి కొన్ని మాటలుచెప్పి భయం భయంగా ఇంట్లోంచి వెళ్ళిపోయాడు.

కాఫీ వేళకి సోమయాజులు సాధారణంగా ఏదో పుస్తకం చేతపట్టుకు కూచుంటాడు తన గదిలో. లక్ష్మీనరసమ్మ ఆ సమయానికి గిన్నెలు తేవడానికి ఆ గదిప్రక్కనించే వెళ్తూ-దొరగారు కాఫీకి రావచ్చు-అనిగాని, కాఫీకి-అనిమాత్రమే గాని అంటుంది. ఈ రోజు ఆమె స్వయంగా అతని గదిలోకి కాఫీ పట్టుకెళ్ళి పక్కని ఓ కుర్చీవుంటే దాంట్లో తను కూర్చొని కాఫీ సేవించండి-అని మాత్రం అన్నది. సోమయాజులు ఆమె కేసి చూడకుండానే, తగిలినంత పనయిన ఆమె చేతిని తప్పించుకునేందుకని, మాట్లాడకుండా మళ్ళీ తనపనిలో నిమగ్నుడయాడు.

లక్ష్మీనరసమ్మకి యెంత ఉక్రోషమైనా వచ్చింది. 'నాకేదైనా పుస్తకం వుంటేయివ్వండి చదువుతాను' అని అన్నది. సోమయాజులు ఇంకా ఆమెవైపు చూడలేదు. 'ఏం పుస్తకాలున్నయ్? ఎరగని యిల్లు గనకనా - కొత్తపుస్తకాల కోసం నన్ను వేధించటం దేనికి!- పాత పుస్తకమేదో తీసుకోవటం చదివేశానంటూ నా ముఖాన కొట్టటం-అంతేగా!' అన్నాడు.

ఉక్రోషం ఇంకా పెరిగిపోయిందామెకు. అయినా ఆ ధోరణిలో మాట్లాడలేకపోయింది. 'పోనీ ఆ పాత పుస్తకాలే యివ్వు. బొత్తిగా కాలక్షేపం వెళ్ళటంలేదు' అన్నది. దాంతో సోమయాజులుకి లోకువై పోయింది. ఇప్పుడింక నీకేసి చూసినా నువ్వేమీ చెయ్యలేవన్నంత ధైర్యంతో చూస్తూ 'అల్లాగే యిస్తాను. కాని నా కిప్పుడు తీరుబాటులేదు. ఈ పుస్తకం ఎనిమిదికల్లా పూర్తయిపోతుంది. అప్పుడు లేచి యిస్తాను' అన్నాడు. కాని ఈ మాపులో అతనికొక విషయం బోధపడ్డది. లక్ష్మీనరసమ్మ వున్న ఆ తీరు చూడగానే ఆమె యేదో సంకల్పించి వచ్చిందని అతను రూఢి చేసుకున్నాడు.

కరుగ్గా చూస్తూ ఆమె అన్నది: 'మహా గొప్ప అధికారం సంపాయించా వెట్లాగయితే నేం,. ఈనాటికి! ఇంత కఠినత్వం నీలో ఉండడానికి నువ్వు అర్హుడివి కావు.' అతడింతకంటె కఠినంగా చూసి 'ఇది మీ నాన్నగారు చెప్పిందేనండి' అని తన చూపులు పుస్తకంకేసి తిప్పాడు.

తాను బొత్తిగా యింత పనికిమాలిన దవుతుందని ఆమె అనుకోలేదు. తమని నిరాకరించే స్త్రీల వెంట పురుషులుండడం ఆమెకు తెలిసినదే కాని స్త్రీలని నిరాకరించే పురుషులుంటారని

ఆమె అనుకోలేదు. కథ ఇట్లా అడ్డం తిరిగేసరికి ఆమె అక్కడ ఉండలేక పోయింది.

ఆనాడే ఊడి పడ్డాడే సీమనుంచో, సోమయాజులు మేనమామ యజ్ఞనారాయణ. అతని కొక కుమార్తె ఉంది. ఇంచుమించు లక్ష్మీనరసమ్మ కున్నంత వయసున్నా పెళ్లి కాలేదు. చివరికి, మొదట్లో వాళ్ళందరూ అసహ్యించుకున్న సోమయాజులు పడ్డాడు ఆయన దృష్టిపథంలో. సోమయాజులే అల్లుడయితే తాను అదృష్టవంతుడౌతాడని ఆయన అనుకున్నాడు.

వేంకటరమణయ్య ఇలా అన్నాడు: 'నా కెప్పుడూ మొహమాటమనేది లేదు. అంచేత నేనెట్లా మాట్లాడినా మీరు అసహ్యించుకోరని భావిస్తాను. మీరు నాకు కొత్తవారే అయినా ఒక్క మీతో మాట్లాడేందుకు నా యీ వజ్జీవ స్వభావం మానెయ్యలేను. మీ పిల్లను సోమయాజులు కిద్దామనే ఉద్దేశ మున్నట్లయితే అది వెంటనే ఉపసంహరింపబడవలసి ఉంది. అయినా నాలుగేళ్లు గడిచిన తర్వాత ఈ కుఱ్ఱవాడిని మళ్లీ తీసుకపోతారని రావడానికి మీకు కాస్త సిగ్గుండాలి. సోమయాజులిన్నాళ్లూ నా డబ్బుతో పెరిగాడు. నా పలుకుబడిమీదే అతనికి బియ్యేలో ఫస్టుక్లాసొచ్చింది. లేకపోతే అతను ఫేలయేవాడు. అటువంటివాడిని అతని దగ్గరనుంచి ప్రతిఫలం కోరకుండా ఎట్లా ఉండను చెప్పండి! మీకున్న ఆస్తికంటె ఘోరం నాది. అందుచేత నాకా ఆలోచన వుండే నేనితన్ని నాలుగేళ్ల కిందట డబ్బు పెట్టి కొనుక్కున్నాను. మీకు ఇతను అప్పుడెట్లా పనికిరాలేదో ఇప్పుడూ అట్లానే పనికిరాడు!- జాతి భ్రష్టమవుతుందని కబుర్లు చెప్పకండి. మీ వైదీక పాళ్లకంటె మా నియోగులకే గౌరవం యెక్కువ. ఆ ప్రతిష్ఠతో నేను తిరిస్తాను......ఇక అన్నిటికన్నా ముఖ్యమైంది ఏమిటో చూడండి — సోమయాజులు మా యింటో నాలుగేళ్ళున్నాడు. ఇందువల్ల అతనికీ నా అమ్మాయికీ వున్న సంబంధమో, పొత్తు అంటారో అది గ్రహించండి.'

యజ్ఞనారాయణ ఏమీ మాట్లాడలేక పోయాడు. కాగా అతనికి ఒక అపరిచిత వ్యక్తి వల్ల అవమానం కలిగింది. ఇందుకు అతనేమీ అనుకోడు గాని తాను వచ్చిన పని పాడయిపోయింది. అతను మర్నాటి ఉదయమే తన గ్రామం వెళ్ళిపోయాడు.

వేంకటరమణయ్యకు ముళ్ళమీద నిలుచున్నట్లనిపించింది. ఇలాగే తాను ఊరుకుంటాడు. ఎవరో సోమయాజులుని మభ్యపెట్టి తీసుకపోతారు. ఈ ఆలోచన రూపించేసరికి ఆయన ఉలిక్కిపడ్డాడు. కూతురువద్దకుపోయి అడిగాడు. సంగతి ఇదీ అని ఆయనకి చాలవరకు బోధపడ్డది. తిన్నగా సోమయాజులు దగ్గరకే వెళ్ళాడు. 'చాల రోజులనించీ ఓపిక పట్టాను గాని ఇక ఆగలేను. అమ్మాయి అవస్థ చూస్తూనే ఉన్నావు గదా! దానికి పంధొమ్మిదేళ్ళు నిండినా పెళ్లి కాలేదు. నేనే వెతకలేదనుకో, సంబంధాలు! కాని ఇదంతా నీమీద భరోసా పెట్టుకునే అని నువు గ్రహించలేదు - ఇదీ బాగానే వుంది. ఇక మనం ఆగితే ప్రపంచంతో నోరు పడలేము. వచ్చే నెలలో మంచి ముహూర్తాలున్నాయట. మా గురించి నువ్వు నీ స్వశాఖను త్యజించాలి. నిన్ను అనాథ స్థితిలో నేను లేవనెత్తాను. అందుకు ప్రతిఫలంగా నువు మమ్మల్ని కష్టంలోంచి వొడ్డు తీసుకురావాలి నువ్వా సంస్కారవాదివేగదా, అన్య శాఖా వివాహానికి జడవవు' అని ఏమో అనేశాడు. సోమయాజులేమీ అనలేదు. కాని మరునాడతను ఆ వూళ్లో లేడు.

మేనమామ దగ్గిరికి వెళ్లి మొదట అతనన్న మాట లివి: మామయ్యా, నువ్వేమిటి యింత తెలివి తక్కువ పని చేశావు! నా కోసం వాళ్లింటికొచ్చి నాతో ఒక్క మాటయినా మాట్లాడకుండా వొచ్చేశావ్? నీకక్కవలసిన ప్రశ్నకి జవాబు నాదగ్గిర దొరుకునే - నిష్కారణంగా ఆ మనిషితో వ్యర్థ ప్రలాపం పెట్టుకున్నావ్. అం- పోనీలే ఎలాగో ఒకలాగ ఆయనతో సంబంధాన్ని తెగతెంపులు చేసుకున్నాను. పద ఇంటికి, నా కాకలి వేస్తోంది.'

వేంకటరమణయ్య తన యింటి దగ్గిర సోమయాజులుంచిన ఉత్తరం చూసి తెల్లబోయాడు; కాని సోమయాజులు ఆ మాటలు చెప్పిన తర్వాత యజ్ఞనారాయణ ఎందుకు తెల్లబోయాడూ అన్నదే ప్రశ్న!